# కాపోడూ[1], కూలోడూ

సెనిక్కాయ వామి సాట్న యాన్నో కుక్క కొరుకుతా వుండేది యినపడింది ఎంకరెడ్డికి. లేసి, సేతిలైటు యేసి సూసి ... "థేయ్, నీయమ్మ ! సచ్చిపోతావే ఆ కాయల్దిని" అని అదిలిచ్చినాడు. యాటా కల్లాల్లోకి సెనిక్కాయ వాములొచ్చేతలికల్లా కుక్కలీనుకొని వుంటాయి. పిల్లల్నెనకాలేసుకోని తల్లి కుక్క వచ్చి కాయ కొరికితే, తల్లిన్జూసి పిల్లలూ నేర్సుకుంటాయి. పుట్నాక రోన్నాళ్ళు బుజ్జిముండలాలుండే కుక్కపిల్లలు సెనిక్కాయల్దిని, కక్కుకుంటా వాయిగొట్టి సచ్చిపోతాయి. కుక్క అయిదారు పిల్లల్ను యీనుకుంటే అందులో ఒకటి రెండు బతికి పెద్దయితే గొప్ప. అందుకే 'కుక్క బతుకు' అనేది, అనుకొన్నాడు ఎంకరెడ్డి.

కుక్క పోయిందా, లేదా ? అని మల్లా సేతిలైటు ఏసి సూసినాడు. కల్లం ఎలుపునా కంకుల పడుగుండాది. 'రేపు పడుగు మారిపిచ్చాల, పై తట్టు బాగనే ఎండింది' అనుకుంటా గుడిసెలోకొచ్చినాడు. గుడిసెకు ఒక మూల్న సొప్ప జారిపోయి, ఆ న్నుంచీ సలిగాలి దూర్తా వుంది. నల్ల దుప్పటి నిండా కప్పుకోని, కుక్కి మంచంలో కాళ్ళు ముడ్సుకోని పండుకొన్నాడు. యాపసెట్టు మీద గద్ద అర్సడం యిని, మంచం కింద గంపలో వున్న కోడిపెట్ట 'కుర్, కుర్' అని కోడి పిల్లల్ను ఎచ్చరిచ్చింది.

ఊళ్ళో మాట మునిగినా మాదిగిండ్లల్లో పిల్లోల్లెవురో తప్పెట్లు వాంచుతా వుండారు. అది రెండో అడుగా మూడో అడుగా వాళ్ళు వాంచేది ? అని రొంత సేపు యిన్నాడు ఎంకరెడ్డి. అదీ గాదు, యిదీ గాదు, రొండిట్నీ కలుపుతాండారు. ఆ మొయిన పరుగెత్తా పోయి "తప్పు వాంచుతా వుండార్రా పిల్ల నా కొడుకుల్లారా ! మీరు మాదిగోళ్ళ పిల్లోళ్ళేనా, కాదా ?" అని తిట్టాల్ననిపిచ్చింది. తప్పెట వాంచుతే ఎంత దూరాన యినపన్నా ఎంకరెడ్డికి ఏదో వుశారొస్తాది. సిందు వాదనయితే 'జెగ్గనక, జెగ్గనక' అని ఎగరబుద్దయితాది యిప్పటికీ. వొయిసప్పుడు...... వొయిసప్పుడేంలే, అరవై దాట్నాక గూడా తప్పెట్లు వాగుతాండే తప్పుడు, తన పై మీది వొల్లె ఎగరేస్తా ఎన్నిమాట్లు 'జెగ్గనక' తొక్కలేదు.

"ఒరే, ఎంకరెడ్డి సిందు తొక్కుతావుండాడ్రా" అని అందరూ నిలబడుకోని సూసేవాళ్ళు. యిప్పుడు గూడా ముసిలోడయినందువల్ల మానుకోలా. మొట్టమొదుట తను సిందు తొక్కుతా వుంటే ఊళ్ళో వాళ్ళంతా మాట్టాడకుండా అబ్బురంగా సూసేవాళ్ళు. అవతల తను నడిపాయంలో కొచ్చేతప్పటికల్లా, ఆడా మొగా నగుతా సూసేవాళ్ళు. అప్పటికే "సిందు తొక్కడం ఏందితీ సీద్రెం ...." అనుకొంటా వున్నెట్టు అగుపిచ్చేది. మల్ల రోన్నేండ్లకు తన కొడుకు నారపురెడ్డి, కోడలు నారాయణమ్మా అర్సబట్టిరి. "మాదిగోళ్ళు తప్పెట వాంచుతే, కాపోనివై సిగ్గుల్యాకుండా ఎగుర్తావా" అని యీళ్ళు ఎగరబట్టిరి. 'యింగ యాల్లే వాళ్ళతో తిట్లు తినడం' అని అప్పట్నించీ సాలిచ్చె.

వాంచేవాడు మాదిగోడయితేనేం యెవుడయితేనేం, తప్పెట వాదన ఒక యిద్దె. అస్సలుకది అల్లాటప్పా యిద్దా ? గూని గంగడు తప్పెట వాంచుతే యిన్నో దేవుడన్నా అది యిద్దె కాదంటాడా ? అంటే, వాన్ని

1) రైతు 2) తప్పెట

మనిసనాల్నా ? వాడు సిందు వాంచుతే, వూగిపోవాల్చిందే ఎట్టాటోడయినా ! ఒక్క పలక[2] మీద నాలుగు పలకల వాదన యినిపిచ్చేవాడు. అట్టనే నాలుగు పలకల్ను ఒక్క పలక వాంచినట్టే వాంచేవాడు. గుంపులో వాంచినా వాని సేయీ, వాని తప్పెటా అప్పుడే తెల్సిపోతానే వుండేది. తప్పెట మెడకాయకు తగిలిచ్చుకోని, ఎడం సేతి ఏళ్ళతో సన్నపుల్ల పట్టుకోని, 'నకనక' అని కొట్టబర్తే గుండె జల్లుమనేది, లోపల నెత్తర పొంగేది. వానికి దండంబెట్ట బుద్ధయ్యేది.

ఊళ్ళో ఎవురయినా పెండ్లి జేసుకుంటే తప్పెట్లు ల్యాకుండా జరిగేది కాదు. ఎన్ని తప్పెట్లు వాగితే అంత గొప్ప. ఇప్పుడయి మొరటు. సిల్మా పాటల పెట్టె పెట్టుకోని పెండ్లి జేసుకొంటా వుండారు. అదే గాదు .... అప్పుడు సన్నోళ్ళయినా పెండ్లి జేసుకుంటే, వున్నోకాడికి పని పాటలోళ్ళను పిల్చి పరవాన్నం, బువ్వా పెట్టేవాళ్ళు. యిప్పుడట్ట పెట్టేవాళ్ళే లేరు. పనుల్జేసేవాళ్ళతో పనుల్జేయిచ్చుకోడమే గాక, వాళ్ళకు తెల్చిన యిద్దెను గౌరవిచ్చడమూ, సుబకారియాలు జరిగితే కలుపుకోడమూ వుండేది.

ఒక్క పెండ్లిండ్లు జరిగే తప్పుడనే కాదు. పన్జేసేవానికీ... వాడు సేద్యగాడయినా కూలోడయినా, వానికీ కాపోనికీ మంచి సమందముండేది. సమందమంటే సేద్యగానికి సేలో బాగమిచ్చినాడా, కూలోనికి పాతర తీసి వూరికినే గింజలు కొల్చినాడా అంటే కాదనుకో. కట్టం జేసేతప్పుడు యీడు కాపోడు, యీడు సేద్యగాడు, యిదో యీడు కూలోడు అంట తేడాలుండేయి గావు. సేద్యగాన్తో పాటు తనూ కాడికి పోతానే వుండేవాడు. బండికి మేతేసినారంటే, సేద్యగాడు బండి మీందుంటే తాను కిందా, సేద్యగాడు కిందుంటే తాను బండి మీందా వుండేవాడు. కూలోన్తో పాటు కొడవల్తీసుకోని మునుం పట్టేవాడు. మొబ్బురానీ, మోడం రానీ, ఎండగాయనీ ఎరగాలి గానీ, సేద్యానికి పోయొచ్చి యేయాలైనా సేద్యగాన్తో పాటు ఇంట్లో ఆడోళ్ళతో పిల్లోళ్ళతో కల్చి ఏట్నించి కడవల్తో నీళ్ళు మోసేవాడు. రొచ్చుగారే ప్యాడను పారల్తో సెక్కి దిబ్బలో నుంచి కూలోళ్ళు యిసిరేస్తా వుంటే, అందుకోని బండ్లో పోసుకునేవాడు.

యిట్టా యీ పని, ఆ పనని గాదు, ఏ పని జేసినా కాపోడు కూలోడు అనే తేడా వుండేది గాదు. సేనికాడికి సంగటి తెస్తే కాపోడూ అదే తినేవాడు, కూలోడూ అదే తినేవాడు. కాపోడు గడ్డన కూకునేవాడూ, కూలోడు కట్టం సేసేవాడూ అనేదుండేది కాదు. యిప్పుడట్టా యాడుంది ? తన కొడుకూ, మనవని సంగతి జూసినా కాపోనికీ, కూలోనికీ మద్దెన సమందమెట్టా వుందో తెల్చుతాది. కొడుకు నారపురెడ్డి తెల్లబట్టలేసుకోని, రోంత ఎండయితే సెత్రీ పట్టుకోని, ల్యాకపోతే గెట్టుమీందుండే సెట్టు కింద కూచ్చోని సేలో పనిజేస్తా వుండే కూలోళ్ళను సూస్తా వుంటాడు. కూలోళ్ళు పని ఎగ్గొట్టారని కాయిలి కాస్తాన్నెట్టే వుంటాదిగానీ, కాపోడు సేలో పని సేస్తాన్నెట్టుండదు. కాపోడు కాయిలి యెప్పుడు గాస్తాడో, కూలోడు పని తప్పిచ్చుకోడానికప్పుడే సూస్తాడు. అప్పుడీ రొండూ వుండేటియిగావు. పనికత యిట్టుంటాదా, యింగ సేనికాడికి యింటికాన్నుంచీ బువ్వొస్తాది. కూలోళ్ళకు సంగటి, కాపోనికి ప్రత్యేకంగా వరి కూడు ! నీడన కూచ్చున్నోడు వరి బువ్వ తింటావుంటే, ఎండలో పన్జేసినోడు సంగటి తింటా వుంటాడు.

అందుకే యిప్పుడు కూలోడు కూలోడే, సేనోడు సేనోడే అనుకుంటా వుండాడు కూలోడు. ర్రోంత కూలి పెరిగినా గానీ యీ యేరుబందం పోదు. అప్పుడు కూలోడే బాగుపన్నాడని కాపోడు ఏడుస్తాడు. యిప్పుడట్టనే వుంది గదా ! అయితే, ఎప్పుటికీ కూలోడు కూలోడుగానే, సేనోడు సేనోడుగానే వుండాల్నా ? అట్టాటి ఆలోసెన కూలోనికి రాకుండా వుండాల్ననేనా అప్పుడు కాపోడు అట్టకట్టం సేసింది ? ఎంకరెడ్డి యింగ పండుకోల్యాక మెల్లంగా లేసి కూచ్చోని తలాపు నుండే బీడీ అగ్గిపెట్టె తీసి ముట్టిచ్చుకున్నాడు.

సేనోడూ, కూలోడూ ఎట్ట ఒకటయితారో తనకు తెల్దుగానీ, అప్పుడు కాపోనికి అట్టాటి ఆలోసెనేం లేదు. యిద్దరూ ఒకే కట్టం సేసేదాన యిప్పుటికన్నా యిద్దరి మద్దెనా మంచి సమందాలుండేటియి.

యిప్పుడు యీడు యీడే, వాడు వాడే అయిపోయిరి. ‘ఇది యాడిదాకా పోతాదో తెల్దు .........’ అనుకొని, బీడీ పారేసి మల్లా పండుకొన్నాడు ఎంకరెడ్డి. అప్పటికి, మాదిగిండ్లల్లో పలకలు వాగేది ఆగిపాయె.